
# ఫలించని కోరిక

ఎ. విజయలక్ష్మి



'రైలు వేగంగా కదలిపోతూనే వుంది.

లలిత మనసులో ఆలోచనలు సుళ్ళు తిరుగుతూ హృదయము భారమై తల వేడిక్కిపోయి, బెర్తుమీద వాలిపోయింది కళ్ళు మూసుకుని. అలా ఎంతసేపు పడుకుందో ఆమెకే తెలియదు.

'భోజనము తీసుకుంటారా అమ్మా!' అనే జవాను మాటతో వులిక్కిపడి లేచి, 'నాకేమీ వద్దు. ఆకలి లేదు. నువ్వు తినేసిరా' అని చెప్పింది.

'పాలు తేనా అమ్మగారూ!'

'వద్దు. ఫ్లాస్కులో వున్నాయిలే, నువ్వు వెళ్ళు'

చేసేదేమీలేక పనివాడు వెళ్ళిపోయాడు. అంతలో ఓ వ్యక్తి సూటుకేసుతో లోపలికొచ్చాడు. అతను అందంగా, పొడుగ్గా వున్నాడు. అతన్ని చూస్తూనే అతనెవరో గుర్తుపట్టింది. 'జుట్టుకూడ నెరవలేదు. వయసు అతనిమీద తన ప్రభావము చూపలేదు. సందేహము లేదు. ఇతను మోహనే. అతన్ని ఒకటి రెండు సార్లు ఆసక్తితో చూచింది. అయినా ఎందరిలో ఆతను వున్నా అతన్ని పోల్చగలదు. అక్క ఎక్కడుందో... ఆ సుదీర్ఘలోకాలలో ఈతని కోసము నిరీక్షిస్తూ వేచి వుందేమో' అనుకుంటూ, అతనికేసి చూచింది. అతనూ పరీక్షగా తన్నే చూస్తున్నాడు.

పలకరించాలని అనుకుంటూ 'తను జ్ఞాపకమున్నట్లే వుంది' అనుకుంటూ.

'ఎక్కడకు వెళుతున్నారు? కులాసా ?' అంది. మనసులో ఇంకా అడగాలని వున్నా.

'మద్రాసు వెడుతున్నాను. ఏదో మీ దయవల్ల ఇలా వున్నాను. మీరు రాధ చెల్లెలు లలిత కదూ!' అన్నాడు...

'అవును. గుర్తు కొచ్చాననన్నమాట'.

'రాధపోలికలు మీలో చాలా వున్నాయి'.

రాధ స్మృతిలో ఆతని అంతరంగములో మానుకున్న గాయము రేగినట్లయింది, వదనము వాడిపోయింది.

ఆతని వాడిన మోము చూచి మరి మాట్లాడక చూపులు తిప్పుకుని ఆలోచనలలో మునిగిపోయింది. మనసు గతములోనికి జారిపోతూంది. మనసు గత స్మృతులలో బాధగా బరువుగా వుంది.

ఆ రోజుల్లో మోహన్‌వాళ్ళు రాజమండ్రిలో తమ యింటికి నాలుగిళ్ళ అవతల వుండేవారు. మోహన్ నాన్నగారు, రాధ తండ్రి సుందరరావుగారు మంచి స్నేహముగా, ఒకరి యింటికి ఒకరు వచ్చిపోతూ, తరుచు విందులు ఏర్పాటు చేసుకుంటూ ప్రాణమిచ్చుకునే వారు. స్నేహధర్మానికి అడ్డురాని పట్టింపు, భోజన విషయాలు, రాధపెళ్ళి విషయములో సంప్రదాయము, కులం గుర్తు వచ్చాయి ఆ తండ్రికి.

మోహన్, రాధ అన్న రామం ఇద్దరూ స్నేహితులు. తరుచు మోహన్, రామంతో, రాధతో బాట్‌మింటన్, కారమ్స్ ఆడుతూ చీకటిపడితే అక్కడే భోజనము చేసేవాడు. రామం, రాధ వాళ్ళ యింటికి వెళ్ళినా అలానే జరిగేది. ఎప్పుడేనా వాళ్ళతో లలిత కలిసేది. అక్క ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ తిరుగుతూండేది. మోహన్ని చూడగానే ఆ కళ్ళు మరింత అందంగా కాంతిగా ప్రకాశించేవి.

ఎప్పుడూ చిరునవ్వు చిందే మోముతో ఎంత అందముగా వుండేది !

రోజూలానే ఆ రోజు సాయంత్రము మోహన్ వచ్చాడు. శుక్రవారమని అక్క తలంటు పోసుకుంది. అన్నయ్య ఎక్కడికో నాన్నగారు పని మీద పంపుతే వెళ్ళాడు.

తాను మర్నాడు టెస్టువుందని వరండాలో పడక కుర్చీలో పడుకుని చదువుకుంటూ అప్రయత్నంగా తలెత్తి తోటలోకి చూచింది.

వెంటనే దృష్టిమళ్ళించి, 'అమ్మో... నాన్నగారేనా, అమ్మేనా చూస్తే' అనుకుంటూ లేచి కంగారుగా వెనక్కు తిరిగింది. తాను ఇంతసేపూ గమనించనే లేదు. నాన్నగారు తన వెనకగుమ్మంలో నుంచుని వున్నారు. తాను చదువువంకన వాళ్ళను చూస్తోందనుకోలేదు కదా ! అనుకుంటూ గబగబా లోపలికి వెళ్ళిపోయింది. ఆ దృశ్యము ఎప్పుడూ మరువలేదు. నీ రెండలో అక్క, మోహన్ ఎంత బావున్నారు. అక్క మోహన్ మెడచుట్టూ చేతులు వేసి నవ్వుతూ ఏదో చెపుతోంది.

అతను ఆసక్తిగా వింటున్నాడు. చేతిలో బొట్టు లేదు. వాళ్ళు అలా ఎప్పటినుండి వున్నారో అనుకుంది. తన మనసులో ఎంతో దిగులుగా వుంది. అక్క తన్ని ఎవరూ చూడలేదనుకుందేమో! ఎంతో వుత్సాహముగా మరో ఐదు నిమిషాలకు హాల్లో అడుగు పెట్టింది. భయంగా చెవులు నిక్కపొడుచుకుని వింటోంది. తండ్రి ఏమంటాడో? 'ఎన్ని రంకెలు వేస్తాడో!' అనుకుంటూ. కానీ యిల్లంతా నిశ్శబ్దముగా వుంది. తండ్రి గొంతు విన్పించలేదు, అక్క గదిలో సన్నగా పాడుకుంటూంది. పిల్లలు ఆటలకు వెళ్ళిపోయారు.

ఆ నిశ్శబ్దము, ఆ ప్రశాంతత లలిత మనసులో శాంతి కలిగించలేక పోయాయి.

రాత్రి భోజనాలు అయిపోయాయి. మంచినీళ్ళు తాగి పడుకుందామనుకుంటూ వంటింట్లో అడుగుపెట్టిన లలితకు పెరటిలోనుండి మాటలు విన్పిస్తున్నాయి. గుమ్మంలోనుండి చూచింది. అక్క, అమ్మ. అమ్మ కళ్ళు తుడుచుకుంటూ ఏదో చెపుతోంది. స్పష్టంగా తెలియకపోయినా సాయంత్రము జరిగిన సంఘటన గురించే అనుకుంది.

అంతలో అక్క 'ఎన్నయినా చెప్పు నేను మోహన్ని తప్ప చేసుకోను మరోలా జరిగిన్నాడు నేను ఈ లోకంలోనే వుండను' అంటూ విసురుగా వచ్చేస్తూ గుమ్మంలో నిలపడ్డ తన్ను ఒక నిమిషము చూచి లోపలి కెళ్ళిపోయింది.

అమ్మని ఓదార్చాలన్నా తన శక్తి చాలదు. నాన్నగార్కి ఎదురు చెప్పలేక కూతురి కోరిక కాదనలేక అమ్మ నలిగిపోతూందని భోజనాలవేళ గమనించిన లలిత నెమ్మదిగా లోపలి కెళ్ళిపోయింది.

ఏ గొడవా లేకుండా పదిరోజులు దొర్లిపోయాయి. అక్క గదిలోనుండి బయటకు రావటములేదు. మోహను వచ్చినా అన్నయ్యతో మాట్లాడి వెళ్ళిపోతున్నాడు.

'రాధేది' అని అన్నయ్యని అడిగినప్పుడు 'ఒంట్లో బావుండడము లేదురా' అని తప్పించుకున్నాడు.

* * *

ఆవేళ అక్కని చూచుకోడానికి పెళ్ళివారు వస్తారని అమ్మ ఒకటే హడావిడి పడిపోతూంది మధ్యాహ్నము నుండి. అక్క గది విడిచి బయటికి రాలేదు.

ఎంత ప్రయత్నించినా, అక్కని వాళ్ళ ఎదరకు తీసుకు వద్దామన్న అమ్మ తలపు ఫలించలేదు. దువ్విన జుట్టు విరబోసుకుని, వికృతంగా నవ్వుతూ, ఏదో... ఏదో మాట్లాడుతూ పిచ్చిచేష్టలు మొదలుపెట్టింది. నాన్నగారు అక్కని చూచి నిర్విణ్ణులయిపోయారు. అమ్మ కన్నీళ్ళు పెట్టుకుంటూ 'అది చేసుకుంటానన్న వాడికి ఇవ్వాల్సింది. మతి కూడా పోగొట్టుకుంది' అని కట్టలు త్రెంచుకున్న నదీ ప్రవాహములాటి కన్నీరు అపలేక అక్కడనుండి వెళ్ళిపోయింది.

అక్కకు ఒంట్లో బాగులేని కారణము చేత చూపులు నాలుగురోజులు వాయిదా వేయమని కంబురంపారు నాన్నగారు. అక్కలో మార్పేమీ లేదు. పైగా అక్కని చూచిన డాక్టరు కూడ మతి స్థిరము తప్పింది అని నిద్రకు మందు ఇచ్చి వెళ్ళిపోయాడు.

అమ్మతో ఏం చెప్పారో కానీ అమ్మ నా దగ్గరకువచ్చి 'లలితా! మీ నాన్నగారు ఆ పెళ్ళివారు ఈ రోజు వస్తారని చెప్పారమ్మా! అక్కని చేసుకోవడము ఎలాగూ కుదరదు. నువ్వు చూడమ్మా! నీ కిష్టమైతే చేసుకోవచ్చు' అంది పిచ్చి అమ్మ. 'తన యిష్టము, నా యిష్టము గుర్తించేదెవరు ? గుర్తించే వారుంటే అక్క కీ గతే పట్టేదా: అక్క మనసు సున్నితము కాబట్టి దెబ్బతింది. తను మొండిది ఏది ఎలా జరిగినా తట్టుకోగలదు

అక్కకన్న, ఏడాదే చిన్నది అవటం వల్ల యిద్దరూ ఒక్కలా వుండేవారు. తాను అక్కకన్న ఒక చాయ తక్కువయినా యిద్దరూ కవలపిల్లల్లా వుండేవారు. పెళ్ళివారు వచ్చి తన్ని చూసుకున్నారు. రెండో అమ్మాయిని ఇస్తున్నారు కనుక మరో రెండు వేలు ఎక్కువ యివ్వాలని, లాంఛనాలు కనీసం రెండువేలు యివ్వాలని కబురు చేసారు. మొత్తము పన్నెండువేలు అన్నమాట. నాలుగు వేలు ఎక్కువిస్తే, తమ పరువు ప్రతిష్టలు, లోటుపాట్లు సర్దుకుపోతాయి గావును. అవకాశము వస్తే జారవిడవక ఎక్కువ గుంజాలన్న దురాశ కాకపోతే మరేమిటి? తనకేం లోటు? అక్కకన్న ఏడాదే చిన్న అయిన తను బి.యస్.సి. ఫస్టియర్ చదువుతోంది. ఈ జలగల్లాటి మనుష్యులలో కాలం మారుతూన్నా వీళ్ళలో మార్పు రాదు. తన మనసు ఆలోచనలతో, ప్రమేయం లేకనే పెళ్ళి స్థిరపడిపోయింది. అక్క విషయం గుట్టుగా వుంచాలన్నా పాక్కిపోయింది. నలుగురూ, నాలుగు విధాలా అనుకుంటున్నారు. అక్కకి అపవిత్రత కూడా అంటగట్టి, అవి విన్నప్పుడు అమ్మ చూరు క్రిందకుపోయి దుఃఖము తగ్గాక లోపలికి వచ్చేది.

'పెద్దదానికి చెయ్యకుండా చిన్నదాని పెళ్ళి చేస్తున్నారేవిటమ్మా ! సావిత్రమ్మా' అని అమ్మనే అడిగేశారు ఓ రోజు. 'ఆ... దానికి కుదిరేదాకా దీన్ని అట్టే పెట్టడమెందుకూ...అలా అనే చేస్తున్నామమ్మా. అయినా దాని వంట్లో బాగులేదు.' అన్న అమ్మ మాటలకు ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకుంటూ నవ్వుకున్న ఇరుగు

# ఫలించని కోరిక

పొరుగు అమ్మలక్కలని చూచి తన వళ్ళు మండిపోయింది. వాళ్ళకూ ఆడపిల్లలు వున్నారు. ఈ కష్టాలు వాళ్ళకే వచ్చి నప్పుడు వీళ్ళ పరిస్థితి ఎలా వుంటుందో; అనుకుంటూ.

వాళ్ళకేసి అసహ్యంగా చూస్తూ, 'అమ్మా! లోపలికి పద! నాన్నగారు పిలుస్తున్నారు.' అని అమ్మని తీసుకు గదిలో అడుగు పెడుతూంటే హాల్లో వాళ్ళు వ్యంగ్యంగా నవ్వుకుంటూ పేళనగా, 'గురివింద తన నలుపు ఎరుగ దన్నట్లు, 'వీళ్ళ దాస్తే దాగుతుందా, మనకి తెలియనట్లు ఆ నటన చూడు.' అనుకుంటూ వెళ్ళిపోయారు. ఆ రోజు అమ్మ ఎంత బ్రతిమిలాడినా అన్నమే తినలేదు. అక్క జీవితము ముందు ఎలా గడుస్తుందో అన్న ఆవేదనతో అమ్మ మనసు కృంగిపోయింది. పదిరోజులకే అమ్మలో ఎంతో నీరసము ఆవహించింది. ఎంతో గంభీరముగా వుండే నాన్నగారు కూడ ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ గంటలకే గంటలు వాలుకుర్చీలో పడుకుని ఇంటి వాసాలు చూస్తూ గడిపేవారు. రమ స్నేహితులతో ఆటలకు పోతే, అన్నయ్య ఫ్రెండ్ దగ్గలకు వెడితే, ఆ గదిలో అమ్మ, ఆ హాల్లో కుర్చీలో నాన్నగారు, ఈ గదిలో అక్క, ఏం తోచక అటు ఇటూ తిరుగుతూ తను. ఏదో చెప్పాలని చెయ్యాలనీవున్నా చెయ్యలేని అసహాయతా అమ్మని ఓదార్చే శక్తి లేని వయసు. అయినా అమ్మ పక్కలో కూచుని ఓదార్పుగా వీపు మీద చెయ్యి వేసేది.

అమ్మకు నా పెళ్ళి విషయము గుర్తు వచ్చింది కాబోలు నాలుగురోజుల తరువాత లేచి మనసు రాయిచేసుకుని పెళ్ళిపనులు మొదలు పెట్టింది. పనిలోనేనా అమ్మ దిగులు మరిచిపోతూంది కదా; అనుకుంది లలిత.

అక్కకు భోజనము, కాఫీ వేళకు అందించే డ్యూటీ లలితే చూచేది. గది లోకి తీసుకువెళ్ళి తానే పెట్టేది.

ఆరోజు పొద్దుటి కాఫీ తీసుకు గదిలో అడుగుపెట్టిన లలిత కెవ్వుమంటూ అరచి చేతిలో గ్లాసు జారవిడిచి పరుగున పోయి, మంచంమీద అడ్డంగా తల క్రిందకు వేలాడ వేసి పడుకున్న రాధని సమంగా పడుకో పెట్టింది.

అక్కని చూడగానే లలిత వేసిన కేకకు ఇంటిల్లిపాదీ హడావిడిగా గదిలో అడుగు పెట్టారు. లలిత కళ్ళు వర్షిస్తున్నాయి. సావిత్రమ్మ దుఃఖము కట్టలు త్రెంచు కుంది. రామం డాక్టరుని తీసుకొనివచ్చినా ఫలితం లేకపోయింది. ఆమె ప్రాణం ఎప్పుడో పోయింది.

రాధ పోయిందని తెలియగానే మోహను తండ్రి జగన్నాథరెడ్డి, తల్లి సరళమ్మా కొడుకుతో వచ్చారు. స్పృహ తప్పిన అమ్మను ఆవిడే చూచి సపర్యలు చేసింది.

రాధని చూచిన మోహను అచేతనుడై, అలా చూస్తూండి పోయాడు. క్రమంగా తేరుకున్న అతను వాడిన మోము పైకెత్తి అసహ్యత కురుస్తున్న నేత్రాలతో సుందర రావుగారి చూస్తూ 'మీరు...మీరు... మనుషులు కాదు' అంటూ తడబడే అడుగులతో అరికట్టలేని దుఃఖంతో వెళ్ళి పోయాడు. జగన్నాథముగారు మౌనంగా వుండిపోయారు.

అంతా అయిపోయింది. రాధక్కను పసుపు కుంకుమలతో పాడెమీద పెట్టి తీసుకుపోయారు. అక్క మరి లేదనుకుంటే మనసు బరువుగా, భారముగా అయిపోయింది.


ఆ ప్రక్క బట్టలు తీసివేస్తున్నప్పుడు లలితకు నీలిరంగు కాగితము కనపడింది. దిండు క్రింద.

'నాన్నగార్ని కాదనలేక, మోహనుకు అర్పించిన తన హృదయాన్ని మరి ఒక రికి అర్పించలేని కారణముగా, మోహనుకు తను ఎలాగ దక్కనని తెలుసుకుని, ఓ నిర్ణయానికి వచ్చేదాకా మతి తప్పిన దానిలా నటించి, తరువాత ఈ లోకాన్ని విడిచిపోతున్నానని' వ్రాశింది.

రామం ఆ వుత్తరాన్ని ఇంటో, వాళ్ళకు చదివి వినిపించి, మోహను కిచ్చాడు ఆ వుత్తరాన్ని.

మరి కొద్దిరోజులకే మోహన్‌వాళ్ళు ఆ వూరు విడిచి వెళ్ళిపోయారు. అనుకున్న ముహూర్తానికి కాక ఆ తరువాత తన వివాహము జరిగిపోయింది. అమ్మ ఆ బెంగతో మంచముపట్టి ఏడాది తిరగ కుండనే ఈ లోకాన్ని వదిలిపోయింది.

తన తరువాతది రమ కాలేజీలో జేరింది. నాన్నగారు ఏ విషయము పట్టించు కోడము మానివేశారు. దెబ్బతిన్న హృదయము మళ్ళీ దెబ్బలగులుతే తట్టుకో లేదనేనేమో! అది తనక్లాస్‌మేటు రజాక్‌ని పెళ్ళి చేసుకుని వచ్చి, పాదాభి వందనము చేస్తూంటే నిర్వికారముగా వుండిపోయారు. దాని రాకపోకలని ఏమాత్రము ఆటంకపెట్టలేదు.



తన భర్త, అత్తగారు ఏం సాధించే వారనీ, వాళ్ళే, కాశీవెడుతూ, ఢిల్లీకూడ వెళ్ళి వాళ్ళింట్లో వుండి వచ్చారు. రమా, దానిమొగుడూ ఎంతో ఆపేక్షగా చూచారనీ, అన్నీ త్రిప్పి చూపించేరనీ నాలుగురోజులు మురిసిపోయింది అత్తగారు.

* * *

ఆలోచనలలో నుండి వులిక్కిపడి ఎదరకు చూస్తూ, 'అన్నయ్య నాలుగేళ్ళ క్రితము ఇతన్ని కలుసుకున్నప్పుడు పెళ్ళి అయినట్లు చెప్పినట్లు గుర్తు. పెళ్ళి అవులేకూడా భార్య లేదేమో; పని మీద వెడుతున్నట్లున్నాడు. భార్య ఎలా వుంటుంది.' అనుకుంటూ కళ్ళు మూసుకుని పడుకున్న అతన్ని చూస్తూండిపోయింది చాలాసేపు.

ఎంత ప్రశాంతముగా నిద్రిస్తున్నాడో! అక్కని మరచి వుంటాడు. తను కనుపించగానే కొద్దిగా పూర్వపు స్మృతివల్ల బాధ కలిగినా ప్రశాంతముగా పవళించాడు. వేదన తొలగిన అతని వదనము ఎప్పటిలా నిర్మలంగా వుంది. భార్యా, పిల్లలతో అతని జీవితము ఒడిదుడుకులులేక సాఫీగా సాగిపోతోందేమో! అక్క బ్రతికి వున్నా అతని సుఖమే కోరివుండేది. ఒక్కొక్కటి కొందరు దురదృష్టవంతులు మినహా చాలామంది జీవితము సుఖప్రదముగానే గడచిపోతుంది. అంతేనా సుఖముగా బ్రతకనీ భగవంతుడా! అనుకుంది.

ఆలోచనలో ఎప్పుడో కనులు మూసింది.

రాధనే తలుస్తూ ఏకాకిగా బ్రతుకు వెళ్ళ వేస్తున్నాడని లలితకు తెలియదు. తల్లి, తండ్రి వివాహము చేయాలని చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమైనాయి. తన హృదిలో రాధకున్న ఎవరికీ స్థానము లేదని ఎవరినీ వివాహము చేసుకోలేనని చెప్పివేశాడు. పైకి నవ్వుతూ కనిపించే మోహను హృదయాంతరాళములో దాగిన అగ్ని జ్వాల ఎవరికీ తెలియదు.

ఇలాగే పట్టణాల అదృష్టవంతులనూ, దురదృష్టవంతులనూ మోసుకుంటూ బరువుగా సాగిపోతూంది. ●

